క్లుప్తంగా

పెట్రోల్ బంకుల్లో వసతులు కల్పించాలి



మాయలూరులో పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ: పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని మాయలూరు పెట్రోల్ బంకును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు నాణ్యతా పరిమాణాలతో అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం వేసవి కాలం ఎండలు అధికంగా వున్నాయని చలివేంద్రం ఏర్పాటు చేసి మంచినీటిని అందించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, వీఆర్‌ఓలు దస్తగిరిబాబు, వెంకటలక్ష్మిలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



రుద్రవరంలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ అధికారులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో ఇటీవల వేసిన సీసీ రోడ్లను గురువారం క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు పరిశీలించారు. పీఆర్ ఏఈ కమాల్ సాహెబ్ తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరంలో రూ.50 లక్షలతో ఒక్కో రోడ్డు కిలో మీటర్ పొడవున పది రోడ్లు వేశారు. వాటి నాణ్యతను పరిశీలించేందుకు క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఆయా రోడ్లకు సంబంధించి శాంపుల్స్ తీసి ల్యాబ్‌కు పంపించారు. వారి వెంట క్వాలిటీ కంట్రోల్ ఏఈ నాగలక్ష్మయ్య, స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవినాష్, సువర్ణ, జాస్మిన్ తదితరులు ఉన్నారు.

రామకృష్ణ పాఠశాలకు ఫర్నిచర్ విరాళం



పాఠశాలకు అందజేసిన పరికరాలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పాఠశాలకు రూ.5లక్షలు విలువైన ఫర్నిచర్‌ను ఆ పాఠశాల పూర్వ విద్యార్థి పద్మరాజేష్ విరాళంగా అందజేసినట్లు పాఠశాల కోఆర్డినేటర్ మమత పేర్కొన్నారు. గురువారం రామకృష్ణ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పద్మరాజేష్ పాఠశాలకు తనవంతు సహాయంగా ఫర్నిచర్, సైన్స్ ల్యాబ్‌కు చెందిన పరికరాలు, కంప్యూటర్లను అందజేశారు. వీటిని అడ్వాటా స్విట్స్ సంస్థకు చెందిన సీఎస్ఆర్ అనే ప్రోగ్రాం ద్వారా పాఠశాలకు అందజేసినట్లు ఆమె తెలిపారు. విరాళంగా అందజేసిన రాజేష్‌ను కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

మహానంది క్షేత్రంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: క్షేత్రంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఉదయం షిఫ్టులో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా నాగమల్లయ్య, మధ్యాహ్నం షిఫ్టునకు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పి.సుబ్బారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరితో పాటు పలు విభాగాల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, ఏజెన్సీ ఉద్యోగుల స్థానాలను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఉన్నత ఉద్యోగుల అండదండలున్న వారికి కీలకస్థానాలు కేటాయించినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

కండక్టర్ నిజాయతీ



ప్రయాణికుడికి సొమ్ము అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆళ్లగడ్డ: ఆర్టీసీ బస్సులో కండక్టర్ తనకు లభించిన పర్సును ప్రయాణికుడికి అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన బస్సు ఈ నెల 14వ తేదీన మద్దికెర నుంచి ఆళ్లగడ్డ డిపోకు చేరుకుంది. చివరగా కండక్టర్ ఐజాక్ బస్సును తనిఖీ చేస్తుండగా ఓ పర్సు కనిపించగా తీసుకుని చూడగా అందులో రూ.26,100 నగదు కనిపించింది. ఈ సొమ్మును డిపో అధికారులకు అప్పగించాడు. విచారణ చేసిన అధికారులు ఈ నగదు దొర్నిపాడు మండలం చాగరాజువేముల గ్రామానికి చెందిన బాల నాగన్న గుర్తించారు. గురువారం బాలనాగన్న వచ్చి వివరాలు సరిగ్గా చెప్పడంతో డీఎం వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు పర్సు, నగదు అందజేశారు. ఆర్టీసీ అధికారులు, స్థానికులు కండక్టర్ ఐజాక్‌ను అభినందించారు.

పాల దిగుబడిపై వడదెబ్బ

- మండే ఎండలతో పాడిపశువుల విలవిల
- వడ దెబ్బకు గురైతే చూడి కట్టే అవకాశం తక్కువే
- వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలతో పాడిపశువుల సంరక్షణ

గోస్పాడు: జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో అధిక శాతం వ్యవసాయమే జీవనాధారం. నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో రైతులు ఎక్కువగా వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ ఆధారంగా జీవనోపాధి పొందుతున్నారు. పాడి రైతులు ఎక్కువగా ఉన్న నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలో దాదాపు 80 వేలకు పైగా పాడి పశువులు ఉన్నాయి. మనిషికి ఏదైనా జబ్బు వస్తే ఇతరులకు చెప్పగలిగే శక్తి ఉంది. అదే నోరులేని పశువులు అనారోగ్యానికి గురైతే ఎవరికి చెప్పలేవు. నిత్యం వాటిని పోషిస్తున్న పశుపోషకులే వాటి కదలికలను గుర్తిస్తుండాలని, వేసవిలో పాడి పశువుల పోషణ సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత పశు వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో పశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడమే కాక పశువులు ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, పశువులు చూలు కట్టే అవకాశం ఉండదని చెబుతున్నారు. వేసవిలో గేదెలు, ఆవుల పట్ల సరైన శ్రద్ధ తీసుకోనట్లయితే వడదెబ్బకు గురై ఒక్కొక్కసారి పశువు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా పాడినే నమ్ముకుని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవిలో పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.



మేతకు వెళ్తున్న పశువులు

వడదెబ్బ లక్షణాలు..

సాధారణంగా పెద్ద పశువుల్లో 99 నుంచి 101 డిగ్రీల ఫారెన్ హీట్ కాగా జీవాలు వంటి చిన్న పశువుల్లో 103 నుంచి 104 డిగ్రీల ఫారెన్ హీట్ వరకు సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. కాగా వడదెబ్బ తగిలిన పెద్ద పశువులలో శరీర ఉష్ణోగ్రత 103 నుంచి 105 డిగ్రీల ఫారెన్ హీట్, జీవాలు వంటి చిన్న వాటిలో 105 నుంచి 108 డిగ్రీల ఫారెన్ హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. పశువులు తూలుతాయి, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. నీడ కోసం చెట్టు కింద చేరి కూలబడటంతో పాటు ఒక్కోసారి కిందపడి కొట్టుకుంటూ స్పృహ కోల్పోతాయి. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించే అవకాశం ఉంటుంది. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ వల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసార వ్యాధి వ్యాపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఎండాకాలంలో పశువులకు వడదెబ్బ తగిలిందని రైతులు గ్రహించాలి.

జాగ్రత్తలు ఇవే...

- వేసవిలో పశువులు తాగే నీరు స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉంచాలి.
- కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుదు వ్యాధులు కలుగుతాయి. కాబట్టి పశువులు తాగేందుకు స్వచ్ఛమైన నీటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి.
- రోజులో కనీసం మూడుసార్లు నీటిని అందించడం అవసరం
- ఆరుబయట తొట్టిల్లో పగలు నిల్వ ఉన్న నీరు వెచ్చగా మారతాయి కాబట్టి నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి.
- ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువ నీటిని తాగుతాయి. వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సు తదితరాలను బట్టి నీరు అవసరమవుతాయి.
- పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి నాలుగు లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.

మండలాల వారీగా పాడి వివరాలు ఇలా..

మండలం	పాడి పశువులు	పాడి రైతులు
ఆళ్లగడ్డ	16,281	5,249
చాగలమర్రి	19,423	3,156
దొర్నిపాడు	5,875	1,965
రుద్రవరం	17,456	5,248
శిరివెళ్ల	11,095	3,154
ఉయ్యాలవాడ	7,924	2,258
గోస్పాడు	7,354	2,145
నంద్యాల	4,389	1,874

వడదెబ్బ తగలకుండా..

వేసవిలో పశువులను ఎండలోకి వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు వదలాలి. పశువులకు వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను రోజు పలు సార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురువుతాయి. వాటిపై తరచుగా చల్లటి నీటిని చల్లుతుండాలి. గాలి బాగా ప్రసవించేటట్లు పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి ఆకులతో గానీ, ఎండిన వరి గడ్డితో గాని కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేట్లు చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులైతే పంకాలు ఏర్పాటు చేయాలి.

పశు వైద్యులను సంప్రదించాలి



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలివీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లటి నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారులను సంప్రదించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయాలి. రక్తంలో డెక్స్ట్రోజ్ సైలెన్ ఎక్కించడం వల్ల శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడుతాయి.

– అభిలాష్‌రెడ్డి, పశువైద్యాధికారి, యాళ్లూరు

బడి మానేసిన బాలికలకు కేజీబీవీ ప్రవేశాల్లో ప్రాధాన్యత

ఉయ్యాలవాడ: బడి మానేసిన బాలికలకు కస్తూర్బా ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎంఈఓ – 1 రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ 1గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల ఏపీ సమగ్ర శిక్షలో ఏఎల్ఎస్ఈఓగా విధులు నిర్వహించే రఘురామిరెడ్డిని ఉన్నతాధికారులు ఉయ్యాలవాడ ఎంఈఓ 1గా బదిలీపై చేయడంతో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ మండలంలో బడి బయట వున్న 164 మంది బాలబాలికలను పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రవేశం కోసం బాలికలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే వెంటనే వారికి ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన, నాణ్యతతో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 వీరప్రతాప్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్ నాగేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు మహబూబ్ పీరా, గౌరవాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సభ్యులు అమీర్, సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆదామ్‌లు పాల్గొన్నారు.



ఎంఈఓ-1గా బాధ్యతలు స్వీకరిస్తున్న రఘురామిరెడ్డి

వర్గీకరణ రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం



అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ఆళ్లగడ్డ: ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణ రద్దు చేసే వరకు ఉద్యమాలు ఆపేదేలేదని మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెన్నెల సుధాకర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణను నిరసిస్తూ గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వర్గీకరణ వద్దు.. ఐక్యత ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ నుంచి మాలలు రాజీనామా చేసి బయటకు రావాలన్నారు. తన రాజకీయ పబ్బం కోసం దళితుల మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చు పెడుతోందన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలపై దృష్టి మళ్లించేందుకు వర్గీకరణ బిల్లును ప్రవేశపెడుతున్నారన్నారు. రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం తగిన ఫలితం అనుభవించక తప్పదన్నారు. కార్యక్రమంలో నాగేళ్ల కరుణాకర్, ఓబులేసు, సామేల్, వెంకటేష్ తదితరులున్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): 2025 బదిలీల చట్టం ఏపీ నుంచి మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు వరప్రసాదరెడ్డి కోరారు. గురువారం మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్నం ఉపాధ్యాయులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు బదిలీల చట్టంలో పూర్తిగా నష్టపోతారన్నారు. 2000లో డీఎస్సీ ద్వారా పురపాలక పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలు చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు మున్సిపల్ యూఎల్‌బీలు ఉన్నాయని, ఒకటి నంద్యాల మున్సిపాలిటీ, రెండు ఆదోని మున్సిపాలిటీల్లో ఉండటం వల్ల దాదాపు 170 కిలో మీటర్ల దూరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు మున్సిపల్ కమిషనర్లచే ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని, అందరికీ కలిపి ఒకే సీనియార్టీ ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. విద్యాశాఖ ఇచ్చిన జీవో నెం.84 మున్సిపల్ సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఉందన్నారు. నిరసనలో మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, దేవేంద్రుడు, సుబ్బరాయుడు, నళిని, నిర్మల, శారదమ్మ, సీతా రామిరెడ్డి, సుధారాణి, మహేశ్వరి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

ఇఫ్తార్ విందు

నంద్యాల(అర్బన్): ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆల్ మదద్ కంప్యూటర్ సెంటర్‌లో వివిధ మతాలకు చెందిన ప్రముఖులతో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు ఆకుమల్ల రహీం పర్యవేక్షణలో నిర్వహించిన విందులో రాయలసీమ సాగునీటి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సుబ్రమణ్యం, సలాముల్లా, చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగుప్త, శివరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, క్రిస్టియన్ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ కారు రవికుమార్, పాస్టర్ బెన్‌హిల్, ఇమ్మానియేల్, ఏసుపాదం, మహబూబ్‌బాషా, రఫీ, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకుమల్ల రహీం మాట్లాడుతూ హిందూ ముస్లిం, క్రిస్టియన్ సంఘాల నాయకులు హాజరు కావడం భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపినట్లు అయ్యిందన్నారు.

కావ్..కావ్.. నీళ్లు లేవు!



మండు వేసవిలో ప్రజలకే కాదు పశుపక్ష్యాదులకు గొంతెండుతోంది. ఎక్కడ చూసినా నదులు, వాగులు, వంకలు ఎడారిని తలపిస్తుండటంతో దాహంతో విలవిలలాడుతున్నాయి. దొర్నిపాడులో ఓ కుళాయికి నీరు వస్తుండంతో కాకి దప్పిక తీర్చుకుంటూ కనిపించింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు చిన్నప్పుడు చదువుకున్న కాకి ఉపాయం కథ గుర్తు చేసుకున్నారు. కుండలో రాయి వేయకుండానే కుళాయి వద్ద దాహం తీర్చుకుంది అంటూ చర్చించుకున్నారు. – దొర్నిపాడు

రేషన్ బియ్యం స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని స్థానిక విజయా డెయిరీ సమీపంలోని ముళ్లపొదల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 195 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాలుకా ఎస్ఐ గంగయ్యయాదవ్ తెలిపిన వివరాల మేరకు.. బియ్యం అక్రమ నిల్వపై పోలీసులకు సమాచారం అందడంతో వాటిని స్వాధీనం చేసుకుని సివిల్‌సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

బొమ్మలసత్రం: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో హరికృష్ణ అనే ఎంఎన్‌ఓపై దాడి ఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణ శివారులోని వైఎస్సార్ నగర్ వీధికి చెందిన నరసమ్మకు చికిత్స నిమిత్తం ఆమె కుమారుడు సింధిసాగర్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి జీజీహెచ్‌కు వచ్చాడు. అక్కడ ఎంఎన్‌ఓగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ తన విధులకు అడ్డుగా ఉన్నారని సింధిసాగర్‌ను ఎమర్జెన్సీ వార్డు నుంచి బయటికి వెళ్లమన్నాడు. దీంతో ఆగ్రహించిన సింధిసాగర్ తన స్నేహితులతో కలిసి హరికృష్ణపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజానికి ఉపయోగపడే సినిమా తీయాలి

నంద్యాల(అర్బన్): సినిమాలు సమాజానికి ఉపయోగపడేలా నిర్మాతలు తీయాలని ఆల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం అన్నారు. కుటుంబ నేపథ్య చిత్రాలను తీసి ప్రేక్షకులను మెప్పించడంలో మేటి నటభూషనుడు శోభన్‌బాబు అన్నారు. శోభన్‌బాబు 17వ వర్ధంతి సందర్భంగా బొగ్గులైన్ వివేకానంద పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆకుమల్ల రహీం మాట్లాడుతూ 250 కుటుంబ కథా చిత్రాలు తీసి శోభన్‌బాబు ఆంధ్రుల అభిమాన నటుడిగా ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో శోభన్‌బాబు అభిమాన సేవా సమితి కార్యదర్శి చింతలయ్య, జానకీరాం, లక్ష్మయ్య, ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల వేలం పాటలు గురువారం సర్పంచు అయ్యలూరి సుభహాన్ అధ్యక్షతన నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కబేళాకు బహిరంగ వేలం పాట నిర్వహించగా పంచాయతీకి రూ.50 వేల అదనపు ఆదాయం సమకూరింది. గతేడాది రూ. 1.26 లక్షలు పాట రాగా ఈ ఏడాడి రూ. 1.76 లక్షలకు అత్యధికంగా నాగన్న అనే వ్యక్తి పాట పాడి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. కాగా దిన, వారం సంతకు వేలం పాటలు నిర్వహించగా అధికారులు నిర్ణయించిన ధర రాక పోవడంతో ఈ నెల 24వ తేదీకి వేలం వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంబాబు, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఈఓ హరిలీల పాల్గొన్నారు.

అంతరిస్తున్న పిచ్చుకలను కాపాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాథ్

నంద్యాల(వ్యవసాయం): రైతు జీవన గమనంలో, జీవవైవిధ్యంలో ప్రధాన భూమిక పోషిస్తున్న పిచ్చుకలను అంతరించిపోకుండా కాపాడుకుందామని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రనాథ్ అన్నారు. నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' గురువారం సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత శాస్త్రవేత్త, నంది రైతు సమాఖ్య సలహాదారులు డాక్టర్ కె.రవీంద్రనాథ్ అధ్యక్షతన 'జీవవైవిధ్యం-పిచ్చుకల సంరక్షణ' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు, వ్యవసాయ రంగ నిపుణులు మాధవస్వామి, అధ్యాపకులు రఫీ, దంత వైద్యులు డాక్టర్ కిశోర్ కుమార్, ఓబులపతి తదితరులు వక్తలుగా పాల్గొన్నారు. డాక్టర్ దీవిహయగ్రీవా చార్యులు మాట్లాడుతూ పిచ్చుకలు గతంలో పంట చేలల్లో పల్లె ముంగిళ్లలో ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవని, నేడు వాటి సంతతి తగ్గిపోవడం దురదృష్టకరమన్నారు. పిచ్చుకలు మనుగడకు అవసరమైన ప్రాధాన్యత అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల వద్ద పిచ్చుకలకు అనుకూలమైన ప్రదేశాల్లో ధాన్యపు గింజలను నీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. పిచ్చుకల జీవన విధానం గురించి కవితలు వినిపించారు. కార్యక్రమంలో కృష్ణారావు, పుల్లయ్య, శ్రీనివాసరెడ్డి, హుసేని, లక్ష్మయ్య ,రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు మట్టి టిప్పర్లు సీజ్



మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించిన మట్టి టిప్పర్లు

రుద్రవరం: కోటకొండ గ్రామానికి చెందిన చెరువు నుంచి కూటమి నాయకులు అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను నంద్యాల మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. గాజులపల్లె మెట్ట రెండు టిప్పర్లను సీజ్ చేసి మహానంది పోలీసు స్టేషన్‌కు తరలించారు. గత కొంత కాలంగా చెరువులో అక్రమంగా మట్టిని తెలుగు గంగ ప్రధాన కాల్వ వెంట తరలిస్తున్నారు. టిప్పర్ల రాకపోకలతో కట్ట మీది మట్టి దుమ్ముగా మారి గాలికి దిగువన రైతులు సాగు చేసిన వరి, మినుము, సజ్జ, అరటి, మునగ వంటి పంటలపై పడి దెబ్బతింటున్నాయి. దీంతో సరైన దిగుబడులు రాక నష్ట పోతున్నామని రైతులు, గ్రామస్తులు మైనింగ్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులకు మొరపెట్టుకున్నారు.స్పందించిన మైనింగ్ అధికారులు మట్టి తరలింపుపై గురువారం దాడులు చేసి టిప్పర్లను సీజ్ చేశారు. చెరువు మట్టి తరలింపును పూర్తిగా అడ్డుకుని పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి విధులకు రావొద్దు!

- పలువురు ఏజెన్సీ వర్కర్లకు ఫోన్లు



మహానంది దేవస్థానం

మహానంది: దేవస్థానంలో పనిచేస్తున్న కొందరు ఏజెన్సీ వర్కర్లను శుక్రవారం నుంచి విధులకు రావొద్దని సంస్థ యజమానులు ఫోన్లు చేసి చెప్పడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహానంది దేవస్థానంలో రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు పారిశుద్ధ్య పనుల నిమిత్తం ఏజెన్సీ సంస్థ ద్వారా సుమారు 75 మంది పనిచేస్తున్నారు. గత ప్రభుత్వంలో పారిశుద్ధ్య పనుల కోసం సిబ్బందిని సరఫరా చేసేందుకు హక్కులను దక్కించుకున్న సంస్థ గడువు ముగియడంతో ఇటీవల మరో సంస్థ ఆ హక్కులను దక్కించుకుంది. దీంతో సుమారు 12 మందిని విధులకు రావొద్దని నిర్వాహకులు ఫోన్ చేసి చెప్పడంతో బాధితులు అయోమయంలో పడ్డారు.

పారిశుద్ధ్య పనులు చేసేదెవరు?

ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో సుమారు 12 మందిని రావొద్దని చెప్పగా ఇప్పటికే కొందరు కొత్తగా ఇటీవల విధుల్లో చేరారు. ఏజెన్సీ ద్వారా విధుల్లో చేరుతున్న వారంతా నిబంధనల మేరకు పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసమే. అయితే దేవస్థానం వారు వారిని అవసరాన్ని బట్టి ఎక్కడైనా వినియోగించుకోవచ్చు. ఏజెన్సీ ద్వారా గతంలో నియమించబడిన కొందరు ఏళ్ల తరబడి పారిశుద్ధ్య పనులకే అంకితమయ్యారు. ఇదిలా ఉండగా కొత్తగా చేరిన వారిలో కొందరు అధికార పార్టీ నేతలతో దేవస్థానం అధికారులకు ఫోన్లు చేయించుకుంటూ రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో తమకు ఫలానా చోట విధులు వేసేలా చూడండి, ఆ కౌంటర్‌లో డ్యూటీ అయితే బాగుంటుంది, టికెట్ల వద్ద చేస్తామంటూ స్థానిక నేతల ద్వారా ఆలయ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

మహానందిలో చోరీ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తుల సొమ్ము చోరీకి గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కర్నూలుకు చెందిన ముగ్గురు భక్తులు మహానందికి వచ్చారు. రుద్రగుండం కోనేరులో స్నానాలు ఆచరించేందుకు వెళ్తూ వారి వస్త్రాలను గట్టుపై ఉంచి వెళ్లారు. స్నానాలు చేసి బయటికి వచ్చే సరికి వస్త్రాలు కనిపించకపోవడంతో భక్తులు వెతకగా ఆలయంలోపల ఉన్న శివుడి విగ్రహం వద్ద ప్యాంటు కనిపించిందన్నారు. సుమారు రూ.5వేల నగదు, విలువైన కార్డులు పోయినట్లు వాపోయారు.

బాల విద్యకు బలమైన పునాది

ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ కేంద్రాలు బాల విద్యకు బలమైన పునాది అని ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం నంద్యాల మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీడీపీఓ మాట్లాడుతూ నవ చేతన సున్నా నుంచి మూడేళ్ల వరకు చిన్నారుల ఎదుగుదల, అభివృద్ధిని గమనించాలన్నారు. పిల్లల్లో అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాలను వెలికి తీయడానికి బోధన సాగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీరా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పోషణతో పాటు సరైన విద్యను అందించాలని ఏసీడీపీఓ పద్మావతి అన్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ్ బీ-పడాయిబీ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ పోషణ విద్యపై ప్రారంభ దశలోనే దృష్టి పెట్టినట్లయితే పిల్లల భవిష్యత్తు బంగారమవుతుందన్నారు.